ప్రజాశక్తి



ముమ్మరంగా వాహన తనిఖీలు

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లా ఎస్‌పి ఎం.దీపిక ఆదేశాల మేరకు గురువారం జిల్లా వ్యాప్తంగా పోలీసు అధికారులు, సిబ్బంది ముమ్మరంగా వాహన తనిఖీలు చేపట్టారు. వాహనాలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. మోటారు వెహికల్‌చట్టం నిబంధనలు పాటించని వాహన దారులకు జరిమానా విధించారు.



వాహనదారుడితో మాట్లాడుతున్న పోలీసులు

మున్సిపల్ కార్మికుల మెడపై ఫేస్ యాప్ కత్తి!

రద్దు చేయాలని కోరుతున్న కార్మికులు



కాలువలో షిల్ట్‌ని తొలగిస్తున్న కార్మికులు (ఫైల్)

'అయ్యా! మాకు చదువు రాదు.. ఫోన్ ఎలా వాడాలో తెలీదు. ఉదయం లేచి చెత్తలు ఏరడం, కాలువలు శుభ్రం చేయడం, పట్టణాలను, నగరాలను శుభ్రంగా ఉంచడం తప్ప ఫేస్ యాప్ అంటే ఏటో మాకు తెలీదు' అంటూ పురపాలక సంఘాల్లో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులు ఆవేదన చెందుతున్నారు. బలవంతంగా ఫేస్ యాప్ అమలు చేసి తమను ఇబ్బంది పెట్టడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ పర్మినెంట్ సిబ్బందితోపాటు ఔట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న పారిశుధ్య, ఇంజినీరింగ్ కార్మికుల రోజువారి పనికి సంబంధించిన హాజరు విధానంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన మార్పులు తమ జీతాలకే గాక ఉద్యోగాలకు కూడా ఎసరు పెట్టే ప్రమాదం దాగి ఉందని తెలుస్తోంది.

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులు, ఉపాధ్యాయులు, వివిధ ప్రభుత్వ శాఖలలో, మున్సిపాలిటీలలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ కార్మికులకు సంబంధించి ఇప్పటివరకు అమలులో ఉన్న హాజరు విధానం స్థానంలో కొత్త హాజరు విధానాన్ని (ఎపి ఎస్‌ఆర్‌ఎస్) జీవో ఎంఎస్ నంబర్ 159 ప్రకారం ఈ ఏడాది జనవరి 16వ తేదీ నుండి అమల్లోకి తెచ్చింది. ఈ కొత్త హాజరు విధానం ద్వారా ఎవరి సెల్‌ఫోన్లలో వారే స్వయంగా ప్రభుత్వం నిర్ణయించిన ప్రదేశంలో నిలబడి ఫోటో తీసి యాప్ ద్వారా హాజరు పంపించాలి. మున్సిపల్ కార్మికుల్లో అత్యధిక మంది చదువు రానివారే ఉన్నారు. అందులోనూ అత్యధిక మందికి సొంత స్మార్ట్ ఫోన్లు లేవు. దీంతో విజయనగరంతో పాటు బొబ్బిలి, సాలూరు, పార్వతీపురం, నెల్లిమర్ల, రాజాం, పాలకొండ మున్సిపాలిటీల్లో అమలుకు నోచుకోలేదు. విజయనగరం నగర పాలక సంస్థలో 680 మంది కాంట్రాక్ట్, పర్మినెంట్ కార్మికులు ఉన్నారు, బొబ్బిలి లో 149 మంది, పార్వతీపురంలో 166 మంది, సాలురులో 163మంది, పాలకొండలో 96, నెల్లిమర్లలో 57, రాజాంలో 60 మంది చొప్పున పారిశుధ్య కార్మికులు, ఇతర కార్మికులు ఉన్నారు. వీరందరికీ ఫేస్ యాప్ ద్వారా హాజరు తీసుకోవాలన్న ప్రభుత్వ నిర్ణయం కార్మికులకు ఇబ్బందికరంగా మారింది.

పైగా ప్రభుత్వం నిర్ణయించిన యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని పంపించగల అనుభవం అసలే లేదు. అటువంటి వారితో తమ ఫోటోలు తామే తీసుకొని హాజరు పంపించాలని ప్రభుత్వం నిర్ణయించటం కార్మికులను వీధులపాలు చేయటమే. ప్రభుత్వం చెప్పినట్లుగా తన ఫోటో తాను తీసుకొని పంపించకపోతే రోజంతా పని చేసిన వృథా కిందే లెక్క. సక్రమంగా ఫోటో పంపకపోతే ఆ కార్మికుడికి హాజరు పడదు. హాజరు పడకపోతే జీతం కట్ అవుతుంది. వరుసగా 4 లేక 5 రోజులు హాజరు పడకపోతే పని దొంగ కింద లెక్క గట్టి ఉద్యోగం ఊడపీకే ప్రమాదం ఉంది. ఈ కొత్త విధానం పూర్తిగా అమలైతే పండగలు, ఇతర సెలవులు కూడా అమలు కావు. కార్మికులు బానిసల్లాగా పని చేయాల్సి ఉంటుంది. ఇంతటి ప్రమాదాన్ని తెచ్చి పెడుతున్న నూతన హాజరు విధానం (ఎ.పి.ఎఫ్.ఆర్.ఎస్) మున్సిపల్ సిబ్బంది, ఒప్పంద కార్మికులందరికీ ఉరితాడు లాంటిదే.

రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం మాత్రం మున్సిపల్ కార్మికుల గోడు వినిపించుకునే పరిస్థితి లేదు. ప్రభుత్వ ఉద్యోగులతో పాటు చదువు లేని మున్సిపల్ కార్మికులు, గ్రామ పంచాయతీ కార్మికులకు కూడా ఇదే విధానాన్ని అమలు చేస్తానని చెప్పడం గ్రామాల్లో పని చేస్తున్న కార్మికులు కూడా ఆందోళన చెందుతున్నారు. ఎంత దూరంలో పని చేస్తున్న సమయానికి వచ్చి ఫేస్ యాప్ ద్వారా హాజరు వేసుకోవాల్సిందే. పని చేసే ప్రాంతంలో సచివాలయం ఉంటే అక్కడ వేయాలి. లేదంటే ఎక్కడ నిర్దేశిస్తే అక్కడ హాజరు కోసం తంటాలు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ఫేస్ యాప్‌ను రద్దు చేయాల్సిందే



మున్సిపల్ ఉద్యోగులు ఎపి ఎస్‌ఆర్‌ఎస్ విధానం ద్వారా జీతాలకు, ఉద్యోగాలకు రాబోతున్న ప్రమాదాన్ని తిప్పి కొట్టాలి. 2022 జులై సమ్మె సందర్భంగా ఇచ్చిన హామీలు అమలు పట్ల రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ఉదాసీన వైఖరిని ఎదుర్కొని హామీలు అమలు కోసం రాష్ట్రవ్యాప్తంగా ఉమ్మడి పోరాటానికి మున్సిపల్ ఉద్యోగులు, కార్మికులందరూ సంసిద్ధం కావాలి. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి సమస్యలు పరిష్కరించకపోతే పోరాటాలను ఉధృతం చేయటంతోపాటు ఛలో అసెంబ్లీ కార్యక్రమం చేపడతాం.

- కె.సురేష్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి, విజయనగరం



ఫేస్ యాప్‌ను రద్దు చేయాలని నిరసన తెలియజేస్తున్న కార్మికులు (ఫైల్)



రూ.39కే 3 పూటలా?

- **నిరుపేద రోగుల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యం**
- **మూడేళ్ల బిల్లులు పెండింగ్**
- **దాతలిచ్చే ఆహారమే ఆధారం**

ప్రజాశక్తి-సాలూరు

సాధారణంగా చిన్న హోటల్లో కూరగాయల భోజనం తినాలన్నా పూటకు రూ.60 చెల్లించాల్సిందే. ఉదయం టిఫిన్‌కైతే కనీసం రూ.30. రెండు పూటలా భోజనంతోపాటు టిఫిన్‌కి రోజుకు రూ.120 నుంచి 150 వరకు ఖర్చు చేయాల్సిన రోజులివి. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వ ఆస్పత్రుల్లో పేద రోగులకు ఆహారం సరఫరా చేసే కాంట్రాక్టర్‌కి రోజుకు సర్కారు రూ.39 చెల్లిస్తుందంటే ఆశ్చర్యానికి చేస్తోంది. 15 ఏళ్ల నుంచీ ఇదే మెనూ ఛార్జీ. దీంతో దాతలిచ్చే ఆహారమే రోగులకు, వారి సహాయకులకు ఆధారమౌతోంది. మరోవైపు కాంట్రాక్టర్లకు మూడేళ్లుగా బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి.

స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలోని సాధారణ ఇన్ పేషెంట్లకు రోజుకు మూడు పూటలా భోజనం పంపిణీ చేయడానికి ప్రభుత్వం 39 రూపాయలే మంజూరు చేస్తోంది. అంటే ఈ డబ్బులతో ఒక పూట కూడా భోజనం పంపిణీ చేయలేని పరిస్థితి. కానీ కాంట్రాక్టరు మూడు పూటలా భోజనం సరఫరా చేస్తున్నారు. 2008 నుంచి ఇదే మెనూ ఛార్జీలతో భోజనం సరఫరా అవుతోంది. ఆస్పత్రిలో ప్రసవించే గర్భిణులకు రూ.100 మంజూరు చేస్తోంది. ఈ మెనూ ఛార్జీలతో కొంత వరకు మూడు పూటలా భోజనం సరఫరా చేయడానికి అవకాశం ఉంటుంది. కానీ సాధారణ రోగులకు రూ.39గా నిర్ణయించడం, దానికి కాంట్రాక్టరు మూడు పూటలా భోజనం సరఫరా చేయడమే ప్రశ్నార్థకంగా మారుతోంది. రోజూ ఆస్పత్రిలో ఇన్ పేషెంట్లు సుమారు 50మంది వరకు ఉంటారు. గర్భిణుల సంఖ్య పది మంది లోపే. అసలే నిత్యావసర వస్తువుల ధరలు భారీగా పెరిగాయి. వందపడకల ఆస్పత్రిగా సిహెచ్‌సి రూపాంతరం చెందడంతో రోగుల తాకిడి పెరిగింది. నిపుణులైన వైద్యులు సేవలందిస్తున్న పరిస్థితి ఏర్పడింది. ఇలాంటి పరిస్థితుల్లో దశాబ్ద కాలం నాటి మెనూ ఛార్జీలతో రోగులకు భోజనం పంపిణీ చేయాలని ప్రభుత్వం ఆదేశించడం వెనుక చిత్తశుద్ధి లోపం స్పష్టమవుతోంది.

దాతలిస్తున్న ఆహారమే ఆధారం

పట్టణానికి చెందిన సాలూరు పూర్వ విద్యార్థుల సంఘం(సోఫా) సభ్యులు గత కొంతకాలంగా పట్టణంలోని నిరుపేదలకు రోజూ ఆహారం సరఫరా చేస్తున్నారు. కరోనా లాక్‌డౌన్ సమయంలో కూడా వారు ఆస్పత్రిలో రోగులకు ఉచితంగా భోజనం సరఫరా చేశారు. ఇప్పటికీ చేస్తున్నారు కూడా. ఈ దాతలు పంపిణీ చేస్తున్న భోజనమే లేకపోతే రోగులు, వారితో ఉండే సహాయకులు మరిన్ని ఇబ్బందులు పాలయ్యే పరిస్థితి ఉండేది.

ఏళ్ల తరబడి బిల్లులు పెండింగ్

గత ప్రభుత్వ హయాం నుంచీ ఆస్పత్రిలో రోగులకు భోజనం పంపిణీ చేసే కాంట్రాక్టర్‌కి బిల్లులు పెండింగ్లో ఉన్నాయి. దీంతో కాంట్రాక్టరు తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయే పరిస్థితి ఏర్పడింది. సుమారు ఏడు లక్షల వరకు బిల్లులు మంజూరు కాలేదు. నిరుపేద రోగుల కోసం ఆహార బిల్లులు మంజూరు చేయకుండా ప్రభుత్వం తాత్సారం చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

మెనూ ఛార్జీల పెంచే యోచనలో..

ఆస్పత్రిలో రోగులకు సరఫరా చేసే భోజన నాణ్యత తనిఖీ చేసిన తర్వాతే పంపిణీ చేస్తున్నాం. గతేడాది డిసెంబర్ నుంచి కాంట్రాక్టరు ద్వారా మూడు పూటలా భోజనం సరఫరా జరుగుతోంది. మెనూ ఛార్జీలు పెంచే యోచనలో ప్రభుత్వం ఉంది. పెంచాల్సిన అవసరమూ ఉంది.

-ఎన్.అప్పారావు, సూపరింటెండెంట్, ఏరియా ఆస్పత్రి

పెండింగ్ పన్నుల వసూళ్లలో ఉపేక్షించేది లేదు

అసిస్టెంట్ కమిషనర్ ప్రసాదరావు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

దీర్ఘకాల పన్నుల వసూళ్ల విషయంలో ఉపేక్షించేది లేదని సహాయ కమిషనర్ ప్రసాద రావు హెచ్చరించారు. 2022 - 23 ఆర్థిక సంవత్సరం ముగింపు సమయం దగ్గర పడటంతో మొండిబకాయలను వసూలు చేసేందుకు రెవెన్యూ సిబ్బంది రంగంలోకి దిగారు. సహాయ కమిషనర్ ప్రసాదరావు గురువారం తన కార్యాలయంలో రెవెన్యూ సిబ్బందితో సమావేశమై పన్ను బకాయిలపై ఆరా తీశారు. మొండి బకాయి దారుల వద్దకు వెళ్లారు. పూల్ బాగ్ తదితర ప్రాంతాలకు వెళ్లి పన్ను కట్టాల్సిందేనని చెప్పారు. దీర్ఘకాల పన్నుదారులకు నోటీసులు జారీ చేశారు. ఇప్పటికే నోటీసులు ఇచ్చినా స్పందించని వారి ఆస్తులు జప్తు చేయడానికి కూడా వెనకాడబోమని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా సహాయ కమిషనర్ ప్రసాద్ రావు మాట్లాడుతూ 2022 - 23 ఆర్థిక సంవత్సరం ముగింపు సమయం దగ్గర పడడంతో పన్ను వసూలకై ప్రత్యేక కార్యచరణ చేపట్టామన్నారు. సచివాలయాల వారీ బృందాలుగా ఏర్పాటై పన్ను బకాయిలను రాబట్టేందుకు కృషి చేయాలన్నారు. ఈ ఆర్థిక సంవత్సరానికి 43 కోట్ల 49 లక్షల 26 వేల రూపాయలు పన్ను వసూళ్లు లక్ష్యం కాగా ఇప్పటివరకు రూ.24.58 కోట్లు వసూలు చేసినట్లు చెప్పారు. మిగిలిన పన్నులు త్వరితగతిన వసూలు చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. ప్రజలు, పన్ను బకాయిదారులు సకాలంలో పన్నులు చెల్లించి నగరాభివద్ధిలో భాగస్వామ్యులు కావాలని పిలుపునిచ్చారు. ఆస్తి పన్ను, కులాయి పన్ను, ఖాళీ స్థలాల పన్నులను త్వరగా చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్స్పెక్టర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రీ సర్వేతో రైతులకు మేలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - బొబ్బిలిరూరల్/బొబ్బిలి

ప్రభుత్వం రైతులకు మేలు జరిగే విధంగా రూపాయి ఖర్చు లేకుండా వారి భూములకు హక్కులు కల్పిస్తుందని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు అన్నారు. గురువారం పక్కి గ్రామంలో సమగ్ర భూ సర్వే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అదునూతన సాంకేతిక పరికరాలతో చేపడుతున్న భూ సమగ్ర రీ సర్వే ద్వారా సర్వ హక్కులు పొందవచ్చు అని తెలిపారు. జగనన్న శాశ్వత భుహక్కు, భూ రక్షక పథకంలో డ్రోన్ భూ రీ సర్వే చేయడం వల్ల రైతులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ యన్. రాజారావు, సర్వే సిబ్బంది పాల్గొన్నారు.



డ్రోన్ సర్వేను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంబంగివెంకట చినప్పలనాయుడు

వైసిపితోనే సామాజిక న్యాయం

రాష్ట్రంలో వైసిపితోనే సామాజిక న్యాయం జరుగుతుందని ఎమ్మెల్యే శంబంగి అన్నారు. పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని వర్గాల ప్రజలకూ న్యాయం చేస్తోందన్నారు. ఎమ్మెల్సీలుగా ఎస్‌సి, ఎస్‌టి, బిసిలకు ప్రాధాన్యత ఇచ్చి చట్ట సభలకు పంపిస్తున్నట్లు చెప్పారు. కార్పొరేషన్లు ఏర్పాటు చేసి ఒకొక్క కార్పోరేషన్‌లో 11మంది సభ్యులను ప్రభుత్వం నియమించి ందన్నారు. బొబ్బిలి మున్సిపాలిటీలో ఏపార్టీ చేయని విధంగా మున్సిపల్ చైర్మన్ పదవి కాపు సామాజిక వర్గానికి ఇచ్చామన్నారు. ఎంపిలో బిసిలకు ప్రాధాన్యత ఇచ్చామన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ, వైస్ చైర్మన్ జి.రమాదేవి, పట్టణ అధ్యక్షులు ఇంటి గోపాలరావు, తదితరులు వున్నారు.

షేక్ అబ్దుల్ హమీద్‌కు అభినందనలు

వైసిపి మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షులుగా నియమితులైన షేక్ అబ్దుల్ హమీద్‌ను ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు, మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ, వైసిపి పట్టణ అధ్యక్షులు ఇంటి గోపాలరావు, నాయకులు అభినందించారు. పార్టీ బలోపేతానికి పని చేస్తామని హమీద్ అన్నారు.

వెనుకబడిన వర్గాలకు పెద్దపీట

ఎమ్మెల్యే అప్పలనర్సయ్య

ప్రజాశక్తి-గజపతినగరం

ఎస్‌సి, ఎస్‌టి,బిసి, మైనార్టీల అభివృద్ధికి పెద్దపీట వేసింది వైసిపి ప్రభుత్వమేనని ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య అన్నారు. గురువారం ఆ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు టిడిపి ప్రభుత్వం వెనుకబడిన వర్గాలకు మొండిచేయి చ ఊపిందన్నారు. ముఖ్యమంత్రి జగన్ మాత్రం ఇచ్చిన మాటకు కట్టుబడి అన్ని ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూడా 75 శాతం అవకాశం వెనుకబడిన వర్గాలకు కల్పించారని అన్నారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా అన్ని కులాలకు ప్రాధాన్యమిస్తూ కార్పొరేషన్ చైర్మన్లను, డైరెక్టర్లను నిచయమించి వారి అభివృద్ధికి కృషి చేస్తోందన్నారు. విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తీసుకురావాలనే ఉద్దేశంతో నాడు-నేడు ద్వారా పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నామన్నారు. గజపతినగరంలో 30 పడకల ఆస్పత్రిని వంద పడకల ఆసుపత్రిగా మార్చారన్నారు. పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు 'జగనన్నే మా భవిష్యత్తు' అనే కార్యక్రమం మార్చి 18 నుండి ప్రారంభిస్తామని తెలిపారు. సమావేశంలో జెడ్‌పిటిసి సభ్యులు గార తవుడు, పిఎసిఎస్ అధ్యక్షులు కరణం ఆదినారాయణ, మార్కెటింగ్ కమిటీ చైర్మన్ వి.ముత్యాల నాయుడు, తుమ్మికాపల్లి సర్పంచ్ బెల్లాన త్రినాధరావు, గజపతినగరం వైస్ సర్పంచ్ కర్రి రామునాయుడు, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ సామంతు .పైడిరాజు పాల్గొన్నారు.

స్కానింగ్ సెంటర్లలో ధరల పట్టిక తప్పనిసరి

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లాలోని ప్రతీ స్కానింగ్ సెంటర్‌లో ధరల పట్టికను తప్పనిసరిగా ప్రదర్శించాలని డిఎంహెచ్ఒ డాక్టర్ రమణకుమారి తెలిపారు. గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధ చట్టం ప్రకారం ధరల పట్టిక, గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చేయడం చట్ట ప్రకారం నేరం అనే బోర్డులను మూడు భాషలలో అందరికి కనిపించేలా ఏర్పాటు చేయాలన్నారు. ఏ స్కానింగ్ సెంటర్‌లోనైనా ఈ సమాచారాన్ని ప్రదర్శించకపోతే చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎఆర్‌టి, సరోగసి సేవలు అందించేందుకు విజయనగరం జిల్లాలో 2 ఆసుపత్రులకు మాత్రమే అనుమతి ఇచ్చినట్లు డిఎంహెచ్ఒ తెలిపారు. వాటిలో వైజాగ్ ఐవిఎఫ్ సెంటర్, క్వీన్స్ ఎన్‌ఆర్‌ఐ హాస్పిటల్ మాత్రమే ఉన్నాయని తెలిపారు. అనుమతులు లేకుండా ఏ ఆస్పత్రిలోనైనా ఎఆర్‌టి, సరోగసి సేవలు చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకోవడంతో పాటుగా ఆ వైద్య కేంద్రం అనుమతులు రద్దు చేస్తామని తెలిపారు.



క్రీడాకారులను అభినందిస్తున్న డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి

జాతీయ తైక్వాండో పోటీలకు 12 మంది ఎంపిక

అభినందించిన డిప్యూటీ మేయర్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఆత్మరక్షణ క్రీడలు దేహ దారుఢ్యానికి, సమయస్ఫూర్తికి ఎంతగానో ఉపయోగ పడతాయని నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి అన్నారు. గత నెలలో అనకాపల్లిలోజరిగిన రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో కేడెట్ విభాగం నుంచి 12 మంది క్రీడాకారులు బంగారు పతకాలు సాధించి 5వ జాతీయస్థాయి క్యాడెట్ పోటీలకు 12 మంది క్రీడాకారులు ఎంపికయ్యారు. ఈనేపథ్యంలో క్రీడాకారులు డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణిని మర్యాదపూర్వకంగా కలవగా వారిని ఆమె అభినందించారు. అనంతరం మాట్లాడుతూ విజయనగరం జిల్లాకు రాష్ట్రస్థాయి పోటీలలో ఓవరాల్ ఛాంపియన్‌షిప్ సాధించడం స్ఫూర్తిదాయకమన్నారు. ఈనెల 24 నుంచి 28 వరకు తైక్వాండో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో హైదరాబాదులో జరిగే 5వ జాతీయస్థాయి క్యాడెట్ పోటీలలో వీరు పాల్గొంటున్నారని తెలిపారు. జాతీయ స్థాయిలో పోటీలలో కూడా విజయనగర ఖ్యాతిని మరింత ఇనుమడింప చేయాలని అన్నారు. రాష్ట్రస్థాయి పోటీలలో బంగారు పతకాలు సాధించిన వారిలో మహిళా విభాగంలో వి.హిమశ్రీ, పి.లాస్య, ఎం.రేణుక, పి .షణ్ముఖ ప్రియ, బాలుర విభాగంలో టి.వరుణ్ కుమార్, పివిఎం జస్వంత్, కె. రోహిత్ కుమార్, కెఎస్ జి వెంకటాద్రి, ఐ.లక్ష్మీదత్, కె.సాయి కిషోర్ ఉన్నారు. కార్యక్రమంలో కోచ్‌లు రవికుమార్, వినీష్ పాల్గొన్నారు.

ముగిసిన నామినేషన్ల ఘట్టం

ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి 44 మంది నామినేషన్లు దాఖలు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానం నామినేషన్ల ఘట్టం గురువారంతో ముగిసింది. మొత్తంగా 44 మంది నామినేషన్లు వేశారు. ఈ నెల 16 నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైన విషయం తెలిసిందే. బుధవారం నాటికి ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల నుంచి 18 మంది నామినేషన్లు వేయగా చివరి రోజైన గురువారమే ఏకంగా 26 మంది నామినేషన్లు వేశారు. నామినేషన్ల ప్రక్రియ తొలి రోజునే పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభ సందడిగా తన నామినేషన్‌ను దాఖలు చేశారు. 22న ప్రధాన పార్టీలకు చెందిన నాయకులు సీతంరాజు సుధాకర్ (వైసిపి), వేపాడ చిరంజీవిరావు (టిడిపి), పివిఎన్.మాధవ్ (బిజెపి) నామినేషన్లు వేశారు.

250 ప్రజా సంఘాలు బలపరిచిన అభ్యర్థిగా కోరెడ్ల రమాప్రభ

250 ప్రజా సంఘాలు బలపరిచిన పిడిఎఫ్ అభ్యర్థిగా సామాజిక కార్యకర్త డాక్టర్ కోరెడ్ల రమాప్రభ బరిలో ఉన్నారు. రోజు రోజుకూ ఉత్తరాంధ్ర నుంచి ఆమెకు మద్దతు పెరుగుతోంది. అధికారం అండ చూసుకుని వైసిపి అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు అనుకూలంగా ఎయు విసి పివిజిడి.ప్రసాద్‌రెడ్డి విశాఖలో ఈ నెల 19న ఓ హోటల్‌లో ప్రైవేటు విద్యాసంస్థలతో నిర్వహించిన సమావేశాన్ని కూడా ప్రజాసంఘాల కార్యకర్తలే బట్టబయలు చేశారు. ఉత్తరాంధ్ర ప్రజా సమస్యలపై గొంతుకగా డాక్టర్ రమాప్రభ అన్ని తరగతులనూ ఆకట్టుకునే ప్రచారంతో ముందుకెళ్తున్నారు. ఆమె చేస్తోన్న కృషిని ఉత్తరాంధ్రలో అన్ని రంగాలకు చెందిన ప్రజానీకం ముక్తకంఠంతో హర్షిస్తున్నారు.

ధాన్యం బస్తాలు ధ్వంసం

వీరఘట్టం : మండలంలోని చిట్టపూడివలస గ్రామానికి చెందిన రైతులు కుమిలి అప్పలస్వామి, గుంట్రెడ్డి బుజ్జి, యామక అప్పలనాయుడుకు చెందిన సుమారు 20 ధాన్యం బస్తాలను బుధవారం అర్ధరాత్రి ఏనుగుల గుంపు ధ్వంసం చేసింది. ఆరుగాలం ఎంతో శ్రమించి సాగు చేసిన ధాన్యాన్ని ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల నేటికీ కొనుగోలు చేయకపోవడంతో ఏనుగుల గుంపు ధ్వంసం చేసిందని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. పండిన పంటంతా నేలపాలు కావడంతో రైతులు రోదిస్తున్నారు.

అంటివలస మృతుల కుటుంబాలకు

రూ.50 లక్షలు చొప్పున పరిహారమివ్వాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు

ప్రజాశక్తి-కొమరాడ,పార్వతీపురంరూరల్

అంటివలస వద్ద సంభవించిన రోడ్డు ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు రూ.50 లక్షలు చొప్పున పరిహారం ఇవ్వాలని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. రోడ్డు ప్రమాదంలో మరణించిన వారి మృతదేహాలకు గురువారం జిల్లా కేంద్రాస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను సిపిఎం నాయకులు దగ్గరుండి వారి స్వగ్రామం కొమరాడ మండలంలోని అంటివలస తీసుకెళ్లి, సామూహిక అంత్యక్రియలు నిర్వహించారు. బాధిత కుటుంబాలను సిపిఎం నాయకులు ఓదార్చి, ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా రెడ్డి వేణు మాట్లాడుతూ ప్రమాదంలో మరణించిన మెల్లిక శారద భర్త అంధుడని, వారికి ముగ్గురు పిల్లలు ఉన్నారని తెలిపారు. శారద మరణంతో ఆ కుటుంబం రోడ్డున పడిందని ఆవేదన వ్యక్తంచేశారు. మిగతా వారిది అదే పరిస్థితి అన్నారు. ప్రభుత్వం స్పందించి ఒక్కొక్కరికి రూ.50 లక్షలు పరిహారం అందించి, బాధిత కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. తీవ్ర గాయాలైన వారికి రూ.10 లక్షలు చొప్పున సాయం అందించాలన్నారు. విశాఖపట్నం ఆస్పత్రిలో సిపిఎం నాయకులు ఊయక వెంకటేష్ చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అక్కడి వైద్యులు కృషి చేస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు రెడ్డి ఇందిర, కొల్లి సాంబమూర్తి, వైసిపి కొమరాడ మండల కన్వీనర్ ద్వారపురెడ్డి జనార్ధన, ఎపి రైతు సంఘం నాయకులు ఉపేంద్ర, దేవుకోన, చోళ్లపదం సర్పంచులు పాల్గొన్నారు.



మృతదేహాలపై పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

టిడిపి నాయకుల పరామర్శ

జిల్లా ఆస్పత్రి వద్ద మృతుల కుటుంబీకులను మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీశ్, మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు, టిడిపి కురుపాం నియోజకవర్గ ఇన్‌ఛార్జి తోయక జగదీశ్వరి, నాయకులు గొట్టాపు వెంకటనాయుడు, గుల్లిపల్లి సుదర్శనరావు పరామర్శించారు.

పోక్సో చట్టంపై అవగాహన

ప్రజాశక్తి - కొత్తవలస

మండలంలోని వియ్యంపేట డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ బాలికల గురుకులంలో ప్రిన్సిపాల్ టి. జయశ్రీ ఆధ్వర్యంలో వియ్యంపేట మహిళా పోలీస్, పిహెచ్‌సి సిబ్బంది గురువారం పోక్సో చట్టంపై బాలికలకు అవగాహన కల్పించారు. మహిళా పోలీసు భారతి మాట్లాడుతూ ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రన్ ఫ్రమ్ సెక్సువల్ అఫెన్స్ యాక్ట్ అని, మినిస్ట్రీ ఆఫ్ ఉమెన్ అండ్ చైల్డ్ డెవలప్మెంట్ 2012లో ఇంప్లిమెంట్ చేశారని వివరించారు. దీనికి ప్రత్యేక కోర్టులు ఉంటాయని, సంఘటన జరిగిన ఆరు నెలల్లో నిందితుడికి జైలు శిక్ష పడుతుందని తెలిపారు. 10 సంవత్సరాలు నుండి 18 సంవత్సరాల లోపు పిల్లలుపై శారీరాక, మానసిక అఘాత్యాలు జరిగితే వెంటనే పోక్సో కి కంప్లైంట్ చేయాలనీ తెలిపారు. పిల్లలు ప్రైవేట్ పార్ట్స్ పై సెక్సువల్‌గా గాని, పోస్టర్స్ చూపించిన, బ్యాడ్ టచ్ జరిగిన, మానసికంగా గాని నేరం జరిగితే వెంటనే కంప్లైంట్ ఇవ్వవచ్చునని తెలిపారు. దిశా చట్టం, నిర్భయ చట్టంపై అవగాహనా కల్పించారు. పిల్లలు క్రమశిక్షణతో మెలిగి, బాగా చదువుకొని ఉన్నత స్థాయి చేరుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్.పి.హెచ్.ఈ.ఓ. తిరుపతి రావు, హెచ్. వి. పద్మావతి, హెల్త్ అసిస్టెంట్ సత్యారావు, స్టాఫ్ నర్స్ శ్రీదేవి, ఏ. ఎన్. ఎమ్. భవాని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న ఎమ్‌పిహెచ్ఇఒ తిరుపతిరావు


ఎమ్మెల్సీ సురేష్‌బాబుకు అభినందనలు తెలుపుతున్న వైసిపి నాయకులు

ఎమ్మెల్సీ సురేష్‌బాబుకు అభినందనలు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ఎమ్మెల్సీ డాక్టర్ పి. సురేశ్ బాబుకు గురువారం మొయిద ఆయన స్వగృహంలో పలువురు అభినందనలు తెలిపారు. రెండోసారి ఎమ్మెల్సీగా ఎన్నికైన ఆయనను వైసిపి జిల్లా ప్రధాన్య కార్యదర్శి కెవి సూర్యనారాయణరాజు, భోగాపురానికి చెందిన సీనియర్ నాయకులు కాకర్ల పూడి శ్రీనివాసరాజు, డి.ఎల్ రెడ్డి, గుర్ల మండలానికి చెందిన మంత్రి వెంకట రమణ, మొయిదకు చెందిన చందక వెంకట రమణ తదితరులు అభినందించారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

వంగర : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ వావిలపల్లి శ్రీనివాసరావు తెలిపారు. ఎంపిపి ఉత్తరావెల్లి సురేష్ ముఖర్జీ అధ్యక్షతన జరుగు ఈ సమావేశానికి రాజాం నియోజకవర్గం ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ హాజరవుతారని ఆయన తెలిపారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు విధిగా హాజరుకావాలని గురువారం ఒక ప్రకటనలో కోరారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

వేపాడ : దేవరాపల్లి మండలం నుంచి వేపాడ మండలానికి అనుమతులు లేకుండా తరలిస్తున్న ఇసుక ట్రాక్టరును వల్లంపూడి ఎస్ఐ రాజేష్ గురువారం పట్టుకున్నారు. ట్రాక్టరును పోలీసు స్టేషన్‌కు తరలించి యజమాని పైన, డ్రైవర్ పైన కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

సర్పంచుల సంఘం అధ్యక్షులుగా నాయుడుబాబు

మెంటాడ : మండలంలోని పిట్టాడ సర్పంచ్ కాపారపు పైడిపునాయుడు (నాయుడు బాబు) సాలూరు నియోజకవర్గం సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులుగా నియామకమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్పంచ్‌ల సమస్యలను, అధిష్టానం దృష్టికి తీసుకు వెళ్లి తమ శక్తి వంచన లేకుండా పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ పదవి బాధ్యతలు అప్పగించిన ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనువాసురావు, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

సమస్యల పరిష్కారానికి సహకరించాలి


కర్రోతును సత్కరిస్తున్న నాయకులు

నెల్లిమర్ల : దళిత, గిరిజన సమస్యల పరిష్కారానికి సహకరించాలని టిడిపి ఎస్‌సి సెల్ నాయకులు కనగిరి శ్రీను, టొంపల నర్సయ్య కోరారు. గురువారం భోగాపురం మండలం పోలిపల్లిలో నియోజకవర్గం టిడిపి ఇంఛార్జి కర్రోతు బంగార్రాజుని కలిసి కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత దళితులు, గిరిజనుల దాడులకు గురై ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రభుత్వ యంత్రాంగం కూడా దళితులు, గిరిజనుల సమస్యల పట్ల నిర్లక్ష్యం వహించి చిన్న చూపు చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

అడ్‌హాక్ కమిటీ వైస్ ప్రెసిడెంటుగా స్వాతి



పూసపాటిరేగ : గ్రామ, వార్డు సచివాలయ మహిళా పోలీస్ అడహక్ కమిటీ జిల్లా వైస్ ప్రెసిడెంటుగా మండలంలోని కుమిలి సచివాలయం మహిళా పోలీస్ యడ్ల స్వాతిని ఎన్నుకున్నారు. జిల్లా మహిళా పోలీస్ వెల్ఫేర్ అసోసియేషన్ అడ్‌హక్ కమిటీని గురువారం ఎన్నుకున్నారు. జిల్లా ప్రెసిడెంటుగా కొరటాన జయశ్రీ, వైస్ ప్రెసిడెంటుగా స్వాతిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా స్వాతి మాట్లాడుతూ జిల్లా స్థాయిలో తనను ఎన్నుకొని తనకు ఈ బాధ్యతలు అప్పగించినందుకు సంతోషంగా ఉందన్నారు. మహిళా పోలీస్ సంక్షేమం కోసం కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా ఆమెకు కుమిలి ఉప సర్పంచ్ గుజ్జు సురేష్‌రెడ్డితో పాటు గ్రామస్తులు, పంచాయతీ కార్యదర్శి రవి, సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు అభినందనలు తెలిపారు.

టిడిపి నూతన కార్యాలయం ప్రారంభం


కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న నాగార్జున

మెరక ముడిదాం : మండల కేంద్రంలో టిడిపి నూతన కార్యాలయాన్ని నియోజకవర్గ ఇంఛార్జి కిమిడి నాగార్జున గురువారం ప్రారంభించారు. అనంతరం మండల టిడిపి అధ్యక్షులు తాడ్డి సన్యాసినాయుడుతో కలిసి సమావేశమయ్యారు. పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఇప్పటికే గ్రామాల్లో వైసిపి పై వ్యతిరేక ఉందని ఈ నేపథ్యంలో ప్రభుత్వం చేస్తున్న అరాచకాలను ప్రజలకు మరింతగా వివరించాలన్నారు. ఏదో కార్యక్రమం పేరిట ప్రజలకు దగ్గరగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా మెరకముడిదాం మండల కేసి అభివృద్ధి చెందలేదన్నారు. జిల్లా పరిషత్ చైర్మన్, మంత్రికి సంబంధించిన నియోజకవర్గంలో పరిస్థితి ఇలా ఉంటే మిగతా ప్రాంతాలను ఊహించుకోవచ్చునన్నారు. ఆరాచకాలను ఆపేసి అభివృద్ధిపై దృష్టి పెడితే మంచిదన్నారు. అనంతరం తహశీల్దార్‌ను కలసి ఎమ్మెల్సీ ఓటర్ లిస్ట్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రమాప్రభకు మద్దతుగా ప్రచారం

పార్వతీపురం టౌన్ : ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ పిడిఎఫ్ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభకు మద్దతుగా సిఐటియు జిల్లా నాయకులు గొర్లి వెంకటరమణ, ప్రజాసంఘాల నాయకులు బంకురు సూరిబాబు, సంజాన చిన్న ఆధ్వర్యంలో గురువారం పట్టణంలో ప్రచారం చేపట్టారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులను కలిసి కరపత్రాలను పంపిణీ చేశారు. రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని పట్టభద్రులకు విజ్ఞప్తి చేశారు. మెరుగైన విద్య, వైద్యం, ఉపాధి, ఉత్తరాంధ్ర సమగ్ర అభివృద్ధి, ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం కోరెడ్ల రమాప్రభను గెలిపించాలని కోరారు.

అన్నదానం..ఓ వరం : ఎమ్మెల్యే

పార్వతీపురం టౌన్ : అన్నదానం చేసే అవకాశం రావడం ఒక వరమని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. గురువారం పట్టణంలోని నెయ్యిలవీధి కూడలిలో పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి విగ్రహం వద్ద విశ్వబ్రాహ్మణ సంఘం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, వైస్ చైర్మన్ ఇందుపూరి గున్నేష్, వైసిపి పట్టణ అధ్యక్షులు కొండపల్లి బాలకృష్ణ, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, కౌన్సిలర్లు కార్యకర్తలు పాల్గొన్నారు.

చల్లంనాయుడువలసలో ఫ్యామిలీ డాక్టర్

సీతానగరం : మండలంలోని చల్లంనాయుడు వలస గ్రామంలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పెదంకలాం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి ఎం.రాధాకాంత్ రోగులకు వైద్య పరీక్షలు చేసి, మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, అంగన్వాడీ, ఆశా కార్యకర్త పాల్గొన్నారు

ఉపాధి పనుల పరిశీలన

పాలకొండ రూరల్ : మండలంలోని అర్థలి గ్రామంలో చింతలవానిచెరువులో చేపడుతున్న ఉపాధి పనులను ఎంపిడిఒ డొంక త్రినాథులు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేతనదారులు సమయపాలన పాటించి పనులు చేపట్టాలని, కూలి గిట్టుబాటు అయ్యేలా పనులు చేయాలని సూచించారు.

బీమా సాయం అందజేత

పాలకొండ రూరల్ : మండలంలోని లుంబూరు పంచాయతీ గరుగుబిల్లి గ్రామంలో కెంబూరు యోగేశ్వరరావు అనారోగ్యంతో మరణించారు. దీంతో గురువారం వైఎస్ఆర్ బీమా తక్షణ సాయం కింద రూ.10 వేలను ఆయన భార్య రమణమ్మకు సర్పంచ్ తిర్లంగి ఉపేంద్ర కుమార్ అందించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాంబాబు, వెల్ఫేర్ అసిస్టెంట్ మాధురి, గ్రామ నాయకులు నెల్లి నాగభూషణ, కొండు చిన్నంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

రైతుల ఖాతాల్లో రూ.113 కోట్లు జమ

ప్రజాశక్తి- కలెక్టరేట్

ధాన్యం కొనుగోలులో భాగంగా జిల్లాలో 12,913 మంది రైతుల ఖాతాల్లో రూ.113 కోట్లు జమ అయ్యింది. జిల్లాలో 2.27 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం 44,870 మంది రైతుల నుంచి కొనుగోలు చేశారు. రైతులకు మొత్తం రూ.418 కోట్లు చెల్లించాల్సి ఉండగా ఇప్పటి వరకు రూ.416 కోట్లు రైతుల ఖాతాల్లో జమయ్యాయి. మిగిలిన మొత్తం చెల్లింపు ప్రక్రియలో ఉంది.

సైన్స్ ఉపాధ్యాయులకు సమావేశం

ప్రజాశక్తి- బాడంగి

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కాంప్లెక్స్ చైర్మన్ సిద్ధాంతం త్రినాథరావు ఆధ్వర్యంలో తెర్లాం, బాడంగి మండలాల్లో ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లోని సైన్స్ ఉపాధ్యాయులకు పాఠశాల సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సమావేశంలో లెసన్ ప్లాన్, బైజుస్ టాబ్స్ వినియోగం, వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక భోదన, పదో తరగతి విద్యార్థుల శతశాతం ఉత్తీర్ణతకు తీసుకోవలసిన చర్యలు గురించి చర్చించారు. వీటితో పాటు ప్రతీ టీచర్ విద్యార్థులకు నాణ్యమైన భోదన అందివ్వాలంటే నూతన భోదనా పద్ధతులు పాటిస్తూ విద్యార్థులలో సృజనాత్మకతకు దారి తీసేలా భోదన ఉండాలన్నారు. ఉపాధ్యాయులు టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ తయారు చేసి భోదన చేయాలన్నారు. ఈ సమావేశంలో రెండు మండలాల నుండి 70 మంది సైన్స్ టీచర్స్ హాజరయ్యారు. రీసోర్స్ పర్సన్‌గా ఎస్ఎస్ఎం రమేష్ వ్యవహరించారు.



మాట్లాడుతున్న త్రినాధరావు

ఉపాధి పనుల తనిఖీ

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని జగ్గయ్యపేట గ్రామంలో కోమటి చెరువులో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఎంపిడిఒ బిఎస్‌కె పట్నాయక్ గురువారం పరిశీలించారు. ఇందులో భాగంగా క్షేత్ర సహాయకుడు నిర్వాహకంపై అసహనం వ్యక్తం చేశారు. పనిచేసే చోట తప్పనిసరిగా నీడ కల్పించాలని, తాగునీటి సౌకర్యం కల్పించాలని, మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచాలని ఫీల్డ్ అసిస్టెంట్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోసారి పరిశీలనకు వచ్చేసరికి అన్ని సౌకర్యాలూ కల్పించాలని లేకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం వేతన దారుల పని దినాలు పుస్తకాలను ఆయన పరిశీలించారు.


కూలీలతో మాట్లాడుతున్న ఎంపిడిఒ పట్నాయక్

విద్యుత్ లైను ఏర్పాటు చేయాలని వినతి

ప్రజాశక్తి- నెల్లిమర్ల

సీతారామునిపేట గ్రామం నుంచి సాదువుల మఠం వరకూ విద్యుత్ స్తంబాల ఏర్పాటుకు కృషి చేయాలని ఎపి టూరిజం డైరెక్టర్ రేగాన శ్రీనివాసరావు ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్‌ను కోరారు. ఈ మేరకు చీపురుపల్లిలో గురువారం ఆయన్ను కలిసి సమస్యను వివరించారు. ఎమ్‌పి నిధుల నుంచి ఎల్ఈడి బల్బులు ఇవ్వాలని వినతి పత్రాన్ని అందించారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించినట్లు శ్రీనివాసరావు తెలిపారు. అలాగే టూరిజం అభివృద్ధికి కృషి చేయాలని ఎంపి తనకు సూచించినట్లు తెలిపారు. ఆయనతో పాటు వైసిపి నాయకులు ఉన్నారు.

రమాప్రభను గెలిపించాలి

ప్రజాశక్తి- మెంటాడ

మండలంలోని ఆంద్ర, లోతుగెడ్డ, కొండలింగాలవలస పంచాయితీల్లో ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటి చేయనున్న డాక్టర్ కోరెడ్ల రమాప్రభను గెలిపించాలని గురువారం ప్రచారం చేశారు. పట్టభద్రుల ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓటును రమాప్రభకు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ప్రజా సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ రాకోటి రాములు కోరారు. ఓటువున్న ప్రతి ఒక్కరిని కలిసి సేవా ధృకృథం కలిగిన రమాప్రభను గెలిపించినట్లేయితే శాసనమండలిలో గొంతెత్తి ప్రజల సమస్యలను ఆమె గళం ద్వారా వినిపించి సమస్యలు పరిష్కరించే విధంగా ఆమె కృషి చేస్తారని రాములు పేర్కోన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం మండల కార్యదర్శి తామారాపల్లి సోములు, కొండలింగాలవలస ఉప సర్పంచ్ చిలుక సన్యాసిరావు, వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకుడు శంబంగి సింహాచలం, పద్మ తదితరులు పాల్గొన్నారు.


ప్రచారం చేస్తున్న నాయకులు

సామాజిక సేవే రోటరీ లక్ష్యం

బొబ్బిలిరూరల్ : సామాజిక సేవే లక్ష్యంగా రోటరీ క్లబ్ పనిచేస్తుందని ఆ క్లబ్ అధ్యక్షులు జెసి రాజు అన్నారు. గురువారం స్థానిక భవిత క్రేంద్రంలో రోటరీ 118వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా రోటరీ ప్రతినిధులు భవితలో శిక్షణ తీసుకుంటున్న వికలాంగ విద్యార్థులకు పలకలు, పండ్లు, రొట్టెలు, మిఠాయిలు పంపిణీ చేశారు. జెసి రాజు మాట్లాడుతూ సేవే పరమార్థంగా సేవలందించే అంతర్జాతీయ రోటరీ సంస్థ ఆవిర్భావ దినాన్ని వికలాంగ పిల్లల మధ్య నిర్వహించటం ఆనందంగా ఉందన్నారు. బొబ్బిలి, పరిసర ప్రాంతాలలో రోటరీ సంస్థ అనేక సేవాకార్యక్రమాలను నిర్వహిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ప్రతినిధులు శ్రీహరి, జి. శ్రీనివాసరావు, కె. రామకృష్ణ, శంకర రావు, జి. కిరణ్, భవిత సిబ్బంది అనిత, ప్రమీల, విద్యావనరుల కార్యాలయ సిబ్బంది చక్రి, ప్రసాద్‌లు పాల్గొన్నారు.

సదుపాయాలు కరువు

ప్రజాశక్తి - వేపాడ

బొద్దాంలో నిర్మించిన జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయలు కరువైయ్యాయి. నిర్మాణాలు దాదాపు పూర్తయినప్పటికీ రోడ్డు సౌకర్యం లేకపోవడంతో లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఒకపక్క కొండ, మరొక పక్క తోటలు ఉండటం కాలనీకు రహదారి లేకపోవడంతో అవస్థలు పడుతున్నారు. దీనిపై గృహ నిర్మాణ సంస్థ ఏడిని వివరణ కోరగా పూర్తిస్థాయిలో రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించామన్నారు. నిధులు మంజూరైన వెంటనే రహదారి నిర్మిస్తామని చెప్పారు.


సౌకర్యాలు లేని బొద్దాం జగనన్న కాలనీ


ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న డిఎస్‌పి మోహనరావు

దర్యాప్తు వేగవంతం : డిఎస్‌పి

వంగర : కొండతాకరాపల్లిలో వృద్ధురాలు గంటా చిన్నమ్మి హత్య కేసులో దర్యాప్తు వేగవంతం చేయాలని బొబ్బిలి డిఎస్‌పి బి. మోహనరావు తెలిపారు. గురువారం ఆ గ్రామంలో పర్యంటించారు. ఘటన జరిగిన ప్రదేశంతో పాటు గ్రామాన్ని సందర్శించి ఆరా తీశారు. ఘటనకు బాధ్యులైన దోషులను గుర్తించాలని ఎస్ఐ బుడుమూరి లోకేశ్వరరావుకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

'మా కల నెరవేరింది'

బొబ్బిలి: జిల్లాకి ప్రభుత్వ వైద్య కళాశాల కావాలని 2014 నుండి 2019 వరకూ ప్రజల తరపున లోక్ సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు భీశెట్టి బాబ్జీ చేసిన అలుపెరుగని పోరాటినికి స్పందించిన నేషనల్ మెడికల్ కమీషన్ విజయనగరం జిల్లా ప్రభుత్వ వైద్య కళాశాలకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం ఆనందంగా ఉందని లోక్‌సత్తా జిల్లా అధ్యక్షులు ఆకుల దామోదరరావు అన్నారు. మండల కేంద్రంలో ఆయన గురువారం విలేకర్లతో మాట్లాడారు. 2023-24 సంవత్సరానికి గానూ 150 ఎంబిబిఎస్ సీట్లు మంజూరు చెయ్యటం చాలా ఆనందంగా ఉందన్నారు. తమ పార్టీ తరపున ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. రూ.500 కోట్లు వెచ్చించి గాజుల రేగలో ఆధునిక హంగులతో, అత్యాధునిక వైద్య సదుపాయాలతో కళాశాల నిర్మాణం జరగడం అభినందనీయమన్నారు.

కళాశాలలో సమావేశం

కొత్తవలస: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ ఎస్ భీమశంకర్‌రావు అధ్యక్షతన గురువారం పేరెంట్స్ మీటింగ్ జరిగింది. ఈ సమావేశంలో తల్లిదండ్రులు మాట్లాడుతూ విద్యార్థుల క్రమశిక్షణ, భద్రతా దృష్ట్యా ప్రహరీ తప్పనిసరిగా ఉండాలని కోరారు. దానికి ప్రిన్సిపల్ సమాధానంగా నాడు నేడులో భాగంగా ప్రహరీ నిర్మిస్తామన్నారు. మరుగుదొడ్లు నిర్మాణం కూడా చేపట్టాలని తల్లిదండ్రులు కోరగా టాయిలెట్స్ నిర్వహణ, వాటర్ సదుపాయం ఏర్పాటు చేశామన్నారు. పబ్లిక్ పరీక్షలు దగ్గర పడుతున్న నేపథ్యంలో విద్యార్థులను సెల్‌ఫోన్లు, టివిలకు దూరంగా ఉంచాల్సిన బాధ్యత తల్లి దండ్రులదేనని అన్నారు. ప్రతిరోజు పాఠశాల ముగిసిన తరువాత ఇంటి వద్ద చదివించాల్సిన బాధ్యత కూడా తల్లిదండ్రులపై ఉందన్నారు.

ఘనంగా శోధన సంస్థ వార్షికోత్సవం

గరివిడి : మండలంలోని చుక్కవలస గ్రామంలో బాలబడి పాఠశాలలో శోధన సంస్థ 45వ వార్షికోత్సవ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. మాజీ రాష్ట్ర విద్యా కమిషనర్ కె. సంధ్యారాణి పాల్గొని మాట్లాడారు. శోధన సంస్థ ఎన్నో ఏళ్లుగా కొన్ని కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి చిన్నారుల అభివృద్ధికి దోహదపడుతుందన్నారు. ఇటువంటి సంస్థ ఈ ప్రాంతంలో ఉండడం ఈ ప్రాంత వాసులు అదృష్టమని అన్నారు. రిటైర్డ్ ఐఎఎస్ అధికారి, మేనేజింగ్ ట్రస్టీ పిడికె.రావుకు ప్రత్యేక అభినందనలు తెలుపుతున్నామని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, శోధన సంస్థ బాలబడి కో-ఆర్డినేటర్స్, ప్రైమరీ కో -ఆర్డినేటర్స్, బాలబడి టీచర్స్, ప్రైమరీ టీచర్స్, సిబ్బంది పాల్గొన్నారు.


కేక్ కట్ చేస్తున్న సంధ్యారాణి

ఓపెన్ ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు

ప్రజాశక్తి-పాలకొండ

ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించే ఇంటర్మీడియట్ గ్రూపులకు సంబంధించిన ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రభుత్వ జూనియర్ కళాశాల (బాలికలు) ప్రిన్సిపల్ ఎస్.సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. 2022-23 విద్యా సంవత్సరానికి సంబంధించిన ఎపిఒఎస్ఎస్ సూచనల మేరకు ఓపెన్ ఇంటర్మీడియట్ ప్రవేశాలకు ఈ నెల 21 నుంచి 27 వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు చెప్పారు. రెగ్యులర్ ఇంటర్‌లో ప్రవేశం పొంది సంవత్సరం మధ్యలో చదువు మానేసిన విద్యార్థులు, పదో తరగతి ఉత్తీర్ణులై, ఇంటర్ వంటి తత్సమాన కోర్సులలో చేరకుండా ఉన్న విద్యార్థులు ప్రవేశానికి అర్హులని తెలిపారు. పదో తరగతి ఒరిజినల్ సర్టిఫికెట్, ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, పాస్ ఫొటో, మొబైల్ నంబర్ సమర్పించాల్సి ఉంటుందని చెప్పారు. ఇంటర్‌లో ప్రవేశం పొందిన విద్యార్థులు మార్చి ఒకటి నుంచి ఏడో తేదీలోపు సంబంధిత పరీక్షల రుసుం చెల్లించాలని సూచించారు. ఏప్రిల్‌లో ఓపెన్ ఇంటర్ పరీక్షలు జరుగుతాయని తెలిపారు. అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని, వివరాలకు 94907 62685 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

సీతంపేట ఐటిఐలో శిక్షణ

సీతంపేట : సీతంపేట ప్రభుత్వ ఐటిఐలో శిక్షణలు నిర్వహిస్తున్నట్లు ఐటిఐ ప్రిన్సిపల్ టీవీ గిరి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పిఎంకెవివై 4.0 సారథ్యంలో స్కిల్ హబ్ ఇన్‌స్టిట్యూట్ ప్రోగ్రాం ద్వారా సీతంపేట ప్రభుత్వ ఐటిఐను ట్రైనింగ్ సెంటర్‌గా ప్రభుత్వం గుర్తించినట్లు తెలిపారు. ఫోర్ వీలర్ సర్వీస్ అసిస్టెంట్‌కు కనీసం విద్యార్హత ఎనిమిదో తరగతి ఉత్తీర్ణత కలిగి ఉండాలని తెలిపారు. ఎలక్ట్రిషన్ అసిస్టెంట్‌కు కనీసం పదో తరగతి ఉత్తీర్ణత సాధించి ఉండాలని తెలిపారు. ఉచిత స్వల్పకాలిక శిక్షణలకు రెండు రోజుల్లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. విద్యార్హత ధ్రువపత్రాలు, పాస్ ఫొటోలు, ఆధార్ కార్డు, బ్యాంకు అకౌంట్ బుక్ ఐటిఐకి సమర్పించాలని కోరారు.

డిజిటల్ లావాదేవీలపై అవగాహన

సాలూరు రూరల్ : డిజిటల్ లావాదేవీలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ జెఎల్ఎం మూర్తి అన్నారు. గురువారం సాలూరు ఎంపిడిఒ కార్యాలయ సమావేశ భవనంలో బ్యాంకు అధికారులు, వైకెపి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన ఉండాలని చెప్పారు. బ్యాంకర్లు విధిగా వ్యాపారం చేసుకునే వారికి రుణాలు మంజూరు చేసి, వారి కాళ్లపై నిలబడేటట్లు చేయాలని సూచించారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పిఎంఇజిపి రుణాల కింద ఎక్కువ మొత్తంలో రుణ సదుపాయం కల్పించి, వారిని వ్యాపారవేత్తలుగా తయారు చేసేందుకు బ్యాంకర్ల సహకరించాలని ఆదేశించారు. సమావేశంలో ఎపిడి సత్యంనాయుడు, ఎంపిడిఒ జి.పార్వతి, ఎపిఎం జి.సింహాచలం, బ్యాంకు అధికారులు, వైకెపి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

లక్ష్య సాధన దిశగా పనిచేయాలి

సీతానగరం : గృహ నిర్మాణ లక్ష్య సాధన దిశగా పనిచేయాలని ఎంపిడిఒ బి.కృష్ణమహేశ్ రెడ్డి అన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో గురువారం ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహ నిర్మాణంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లది కీలక పాత్ర అన్నారు. మండలంలో తీసుకున్న లక్ష్యాన్ని పూర్తి చేసే దిశగా అడుగులు పడుతున్నాయని, వాటిని వేగవంతం చేయాలన్నారు.

చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి- పాచిపెంట

చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటామని గొట్టూరు సర్పంచ్ సింహాచలం అన్నారు. మండలంలోని కన్నయ్యవలస గ్రామంలో చిరుధాన్యాల సాగు విస్తీర్ణం పెంపుపై ఎఒ కె.తిరుపతిరావు ఆధ్వర్యాన గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎఒ మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్లో పండించే చిరుధాన్యాలకు మద్దతు ధర కల్పించడమే కాకుండా కొనుగోలు కేంద్రాల ద్వారా పూర్తిగా సేకరిస్తున్నట్లు తెలిపారు. గిరిజన రైతులు చిరుధాన్యాల సాగు విస్తీర్ణాన్ని పెంచాలని కోరారు. ఏప్రిల్ నెలాఖరులో వ్యవసాయ శాఖ ద్వారా విత్తనాలు 90 శాతం రాయితీపై అందించడానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు కూడా పంపిస్తున్నట్లు తెలిపారు. ప్రతి సీజన్‌లో మొక్కజొన్న పంట ఒక్కటే వేసినట్లయితే భూములు నిస్సారమై సేద్యం కష్టతరమవుతుందని చెప్పారు. చిరుధాన్యాలతో పంట మార్పిడి లేదా అంతర పంటలు వేసుకుంటే జీవ వైవిధ్యాన్ని కాపాడుకుంటూ అధిక ఆదాయాన్ని పొందవచ్చని తెలిపారు. ఎక్కువ విస్తీర్ణంలో చిరుధాన్యాల సాగు చేపట్టితే ప్రాసెసింగ్ యూనిట్ కూడా మంజూరు చేయడానికి అవకాశం ఉందన్నారు. చిరుధాన్యాలతో బిస్కెట్లు వంటివి ఇంట్లోనే తయారు చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. ప్రస్తుతం పట్టణాలలో వీటి వినియోగం ఎక్కువగా ఉందని, గిరిజన రైతులు ఈ అవకాశాన్ని అందుపుచ్చుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో విఎఎలు భారతి, కిరణ్, రైతులు పాల్గొన్నారు.


రైతులతో మాట్లాడుతున్న సర్పంచ్ సింహాచలం, ఎఒ తిరుపతిరావు

గిరిజనాభివృద్ధి ఏది?

కురుపాం : మూడున్నరేళ్ల వైసిపి పాలనలో గిరిజనుల అభివృద్ధిని ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ దత్తి లక్ష్మణరావు విమర్శించారు. గురువారం మండలంలో పెదగొత్తిలిలో సర్పంచ్ టి.లోకనాథం ఆధ్వర్యంలో ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ముందుగా గ్రామంలో ర్యాలీ నిర్వహించి అనంతరం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి పూర్తిగా శూన్యమైందన్నారు. గిరిజన గ్రామాలకు కావాల్సిన అన్ని మౌలిక వసతులు కూడా కల్పించ లేకపోయిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. కేంద్ర ప్రభుత్వం గిరిజనులకు కేటాయించిన ఉప ప్రణాళిక నిధులను ఈ ప్రభుత్వం నవరత్నాలకు దారి మళ్లించి గిరిజన అభివృద్ధిని గాలికి వదిలేసిందని విరుచుకుపడ్డారు. ఈ కార్యక్రమంలో బిసి సెల్ పార్లమెంట్ అధ్యక్షులు ద్వారపురెడ్డి సత్యనారాయణ, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

త్వరలో వయోజన విద్యా కేంద్రాల ఏర్పాటు

సీతంపేట : మండలంలో త్వరలో వయోజన విద్యా కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు వయోజన విద్యా శాఖా సహాయ ప్రాజెక్టు అధికారి సిహెచ్ ఆర్‌సిడి లక్ష్మి తెలిపారు. గురువారం మండలంలో పెద్దూరు ప్రాథమిక పాఠశాలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ త్వరలో వయోజన విద్య శాఖ ద్వారా అక్షరాస్యత కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందులో సీతంపేట మండలంలో 15 వయోజన విద్యా కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. పెద్దూరు ప్రాథమిక పాఠశాల కేంద్రంగా ఏర్పాటు చేస్తామని తెలిపారు. సీతంపేట, హిరమండలం, కొత్తూరు మండలాల్లో వయోజన విద్యా కేంద్రాలు ముందుగా ఏర్పాటు చేస్తామని తెలిపారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయులు నెల్లి సత్యంనాయుడు, విశ్రాంత ఉపాధ్యాయులు శాంతిశ్రీ తదితరులు పాల్గొన్నారు